క్లుప్తంగా

ఉచిత ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలి

కందనూలు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పించిందని డిపో మేనేజర్ దేవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉచితం ప్రయాణించవచ్చని తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సీఎం కేసీఆర్ కోలుకోవాలని పూజలు



కల్వకుర్తిరూరల్: మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కోలుకోవాలని శుక్రవారం శివ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన పడిపూజలో స్వామివారిని వేడుకున్నారు. కాలిగాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం త్వరగా కోలుకోవాలని శివపూజలు చేసినట్లు ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు శివస్వాములు పాల్గొన్నారు.

11న సర్వసభ్య సమావేశం

కల్వకుర్తిరూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



తాడూరు: మండలంలోని శిర్సవాడలో కాంగ్రెస్ కార్యకర్త జంగయ్య(60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించాలని ఇంద్రకల్ మాజీ సర్పంచ్ వెంకటయ్యకు సూచించారు. దీంతో బాధిత కుటుంబసభ్యులకు మాజీ సర్పంచ్ నగదు అందజేశారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ హుస్సేన్ ఉన్నారు.

పరామర్శ

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన కాటి పాప ఎల్లయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ, ప్రకాష్, అరుణ్‌రెడ్డి, రాముడు, పాషా, బక్కయ్య, రఘు, బొమ్మసాని శివ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న నాయకులు



కొల్లాపూర్: ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు మంత్రిగా, రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని స్వాగతిస్తూ ఆర్యవైశ్య సంఘం నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో సుదర్శన్‌శెట్టి, శేషయ్య, శ్రీనివాసులు, నవీన్, చందనం శ్రీను, లక్ష్మీనారాయణతో పాటు పలువురు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి



తాడూరు: మండల కేంద్రంలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసరించుకొని 12వ వార్డులో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్ల మధ్య మురుగు నీటి కారణంగా జమ్ము అధికంగా పెరిగిందని వాపోయారు. ముగరు వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమలతోపాటు పాముల బెడద అధికం ఉందని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను, జమ్మును తొలగించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

రవాణా సౌకర్యం లేక అవస్థలు



ఆటోలో ప్రయాణిస్తున్న భౌరాపూర్ పెంట చెంచులు

మన్ననూర్: తరతరాలుగా అడవుల్లోనే జీవిస్తున్న ఆదివాసీలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. స్వాతంత్యం వచ్చి 75 ఏళ్లు అయినా చెంచు పెంటలకు రవాణా సౌకర్యం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. గతంలో చెంచులు అటవీ ప్రాంతంలో నివసిస్తూ అడవుల్లో దొరికే అటవీ ఉత్పత్తులను సేకరిస్తూ వాటితో వచ్చే ఆదాయంతో పూట గడుపుతుండేవారు. ప్రస్తుతం అడవుల్లో ఎలాంటి ఉపాధి వనరులు లేకపోవడంతో ఆదివాసీ చెంచులు ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పథకం పనులు చేయడంతో పాటూ మైదాన ప్రాంత గ్రామాలపై ఆధారపడుతూ జీవనం చేస్తున్నారు. పుల్లాయిపల్లి, అప్పాపూర్, రాంపూర్, భౌరాపూర్, సంఘిడి గుండాలు, మేడిమల్కల, గుండాలు సుమారు 11 పెంటలలో నివసించే చెంచులు అవసరాల నిమిత్తం తరుచుగా మన్ననూర్, వటువర్లపల్లి గ్రామాలకు రాకపోకలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఎలాంటి ప్రజా రవాణా సౌకర్యం లేక సుమారు 40–50 కిలోమీటర్ల మేరకు కాలినడకే శరణ్యంగా ఉంది. తప్పని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ఆటో డ్రైవర్లు రూ.1000 నుంచి రూ.1500 వందల వరకు వసూలు చేస్తున్నారని అటవీ లోతట్టు ప్రాంత ఆదివాసీ చెంచులు ఆరోపిస్తున్నారు. ఒక్కరోజు ఆటోలో ప్రయాణిస్తే కష్టమంతా ఆటోల చార్జీలకే సరిపోతుందని చెంచులు వాపోతున్నారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా అప్పాపూర్‌ను గ్రామ పంచాయతీ చేయడంతో పాటూ గ్రామంలో ఆశ్రమ పాఠశాల, చౌకధరల దుకాణం, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేశారు. బస్సు ఏర్పాటుతో ఆదివాసీలు, ఉద్యోగుల రాకపోకలతో పాటూ నిత్యవసర సరుకుల రవాణకు సులభం అవుతుంది. ఇదిలా ఉండగా దశాబ్దాల కాలంగా ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీలు ఓటు వేసేందుకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో అటవీ లోతట్టు ప్రాంత చెంచు పెంటల్లో 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రజా పాలనగా చెప్పే ప్రస్తుత పాలకులు సంబంధిత అధికారులు ఈ దిశగా సమాలోచనలు చేసి చెంచు పెంటలకు కేంద్రంగా ఉన్న అప్పాపూర్ గ్రామ పంచాయతీ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ఆదివాసి చెంచుల సౌకర్యార్థం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పందించి ఆదివాసి చెంచులను ఆదుకోవాలని కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



బస్సు సౌకర్యం లేక మన్ననూర్‌కు కాలినడకనే వెళ్తాం. జీసీసీ, ఆర్టీటీ, మెడికల్ వాళ్ల బండ్లు వస్తే అందులో ఎక్కి వస్తాం. తిరిగి మా పెంటకు వెళ్లాలంటే ఆటోలో పోతాం. ఆటోలో వెళ్తే రూ. 1000 ఇవ్వాలి లేకుంటే ఎవరు రారు.

– కాట్రాజు లింగయ్య, పుల్లయ్యపల్లి పెంట

భయాందోళనలతో పని చేస్తున్నాం

కొంతకాలంగా అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, హెచ్‌డబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్నాను. వారం రోజుల పాటు అక్కడే ఉండి వీక్లీ ఆఫ్ రోజు ఇంటికి రావాలంటే బైక్‌పై రావల్సి వస్తుంది. వసతి గృహానికి అవసరమైన నిత్యవసరాలు తీసుకుని వెళ్లాలంటే ఇబ్బంది. రహదారిలో పలు సార్లు పెద్దపులులు, చిరుత పులులు, ఎలుగుబంట్లు కనిపించాయి.

– రాంలాల్, హెచ్‌ఎం, అప్పాపూర్ ఆశ్రమ పాఠశాల

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: మండల కేంద్రంతోపాటు గుంతకోడూరు గ్రామ పంచాయతీలను ఎంపీడీఓ గంగామోహన్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో పన్నులను 100 శాతం వసూలు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి విత్తనాలను మట్టితో నింపిన కవర్లలో ఉంచాలన్నారు. ప్రతి రోజు నీటిని అందేవిధంగా చూడాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ నాగార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రం శివారులో సాగు చేసిన వేరు శనగ, మినుము పంటలను శుక్రవారం ఏఓ పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు సస్యరక్షణ పనులు చేపట్టి తెగుళ్ల బారిన పడకుండా చూసుకోవాలని కోరారు. మండలంలో యాసంగిలో 7,200 ఎకరాలలో వేరుశనగను సాగు చేశారని ఆయన పేర్కొన్నారు. పంటకు సోకే లద్దె పురుగు నివారణకు ఇమమేక్టిన్ బెంజోట్ 100 గ్రాములు ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఎకరాకు 200 కిలోల జిప్సమ్‌ను పూత దశలో చల్లితే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. మినుము పంటలో బూడిద తెగులు నివారణకు క్లోరోథాలోనిల్ 2 గ్రా ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని వివరించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



వెల్దండ: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మండల నాయకులు భూపతిరెడ్డి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను వారు సన్మానించారు. వెల్దండలో చేపట్టే పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు వారు తెలిపారు.

చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలంలోని జేపల్లి పంచాయతీ, నేమలిగుట్ట తండా గ్రామా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నూర్‌పాల్, సిరాజ్, పవన్, మునిరామ్, నరేష్, కిషన్, రాజు ఉన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతనంగా ఎన్నికైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వెల్దండ సర్పంచ్ భూపతిరెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్, జంగారెడ్డి సర్పంచ్ లింగారెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణలు ఉన్నారు.

ఏపీ మంత్రులను కలిసిన మున్సిపల్ చైర్మన్

కల్వకుర్తిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మంత్రులు పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజాలతో పాటు టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డిలను కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం శుక్రవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నాణ్యమైన భోజనం అందివ్వాలి



లింగాల కస్తూర్బా విద్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్యానల్ బృందం సభ్యులు

లింగాల: విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని జీసీడీఓ శ్రీమతి సూర్య చైతన్య పాఠశాల నిర్వాహకులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని శుక్రవారం జీసీడీఓ ఆధ్వర్యంలో ప్యానల్ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా జీసీడీఓ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యాలయానికి సంబంధించిన అన్నిరకాల రికార్డులను తనిఖీ చేశారు. బోధన తరగతులను ప్రత్యక్షంగా గమనించారు. వంట గది, తరగతి గదులను, స్టోర్ రూం, డార్మెటరీ తదితర వాటిని పరిశీలించారు. తరచుగా ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలని, రోగాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బోధనలో అనుసరించాల్సిన పద్ధతుల గురించి సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్యానల్ బృందం నాయకులు శేఖర్, తాహెర్‌పాషా, పాఠశాల ఎస్‌ఓ శారద, బృందం సభ్యులు అరవింద్, శ్రీనివాసులు, శంకర్ నాయక్, రాజురాథోడ్, స్వరూప, చంప్లీ, సునీతమ్మ, పద్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొల్లాపూర్ రూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చంద్రుడు నాయక్ ఉపాధ్యాయులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు, కొల్లాపూర్ పట్టణంలో ఉన్న సముదాయ పాఠశాలల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. టీఎంఎల్ వినియోగించి ఎఫ్ఎల్‌ఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. డీఎస్‌ఈ–ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో ప్రతి రోజు బాధ్యతగా నూరు శాతం హాజరు నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోరారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందుగౌడ్, చంద్రారెడ్డి, కురుమయ్య, సీఆర్‌పీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వన నర్సరీల పరిశీలన



తిమ్మినోనిపల్లిలో నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: మండలంలోని రాచూర్, తిమ్మినోనిపల్లి గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి నర్సరీల్లో 10 వేల మొక్కలను పెంచాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. అదే విధంగా పండ్లు, పూల మొక్కలను పెంచి హరితహారంలో భాగంగా ఇంటింట మొక్కల పంపిణీ చేయాలన్నారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. అదేవిధంగా పారిశుద్ధ్య పనులను చేపట్టాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ దేవేందర్‌గౌడ్, కార్యదర్శులు పద్మ, మంజుల, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెరటి తోటలపై గ్రామీణుల ఆసక్తి



ఇంటి పెరటిలో ఆకుకూరలను సాగు చేసుకుంటున్న మహిళ

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఐసీఐసీఐ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంతో పెరటి తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. మన్ననూర్, మాచారం, తుర్కపల్లి, వెంకటేశ్వర్లబావి, వటువర్లపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తమ ఇంటి ముందు, వెనుక భాగంలోని ఖాళీ స్థలాల్లో పెరటి తోటలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా నీటి సమస్య లేని కారణంగా ఇంటి ఆవరణలో ఉన్న కొద్ది పాటి స్థలం ఉన్న పాలకూర, తోటకూర, మునగ, కొత్తిమీర, పుదీన వంటి ఆకు కూరలతో పాటూ మిరుప, వంగ, టమాట, గోరుచిక్కుడు వంటి కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. అవసరమైన విత్తనాలను ఉచితంగా అందిస్తునట్లు ఫౌండేషన్ సంస్థ పెసిలిటేటర్ గంధం అంతయ్య తెలిపారు.

పేద విద్యార్థుల సేవే లక్ష్యం



వార్షికోత్సవంలో భాగంగా పాల్గొన్న విద్యార్థులు, క్లబ్ ప్రతినిధులు

తాడూరు: పేద విద్యార్థుల సేవే లక్ష్యంగా పనిచేస్తున్నామని క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇంద్రకల్ ఉన్నత పాఠశాలలో క్లాస్‌మెట్ క్లబ్ 13వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా రూ.90 లక్షలకు పైగా ఖర్చు చేసి విద్యార్థులకు అవసరమయ్యే సామాగ్రిని అందించామన్నారు. 20 మంది ఎంబీబీఎస్, 50 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్థిక సాయంతోపాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పాఠశాల జీహెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు రెబిడెక్స్ ఇంగ్లీష్ పుస్తకాలను అందించామన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.2500 నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థికసాయం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మోహన్‌సాగర్, శ్రీనివాసులు, కృష్ణమోహన్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల బెడద.. తగ్గిన దిగుబడి

- ఆందోళనలో రైతులు
- 4,668 ఎకరాలలో మామిడి తోటల సాగు



వీపనగండ్లలో మామిడితోట

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలలో మామిడి తోటలను సాగుచేస్తున్న రైతులు పంటల దిగుబడి సరిగా రాక నష్టపోతున్నారు. మండలంలో అత్యధికంగా రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. మూడేళ్లుగా కనీస పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాదైన ముందస్తు రైతు అవగాహన సదస్సులు నిర్వహించి అధిక దిగుబడులు వచ్చేలా చూడాలని పలువురు రైతులు ఉద్యానవన శాఖ అధికారులకు విన్నవిస్తున్నారు.

4,668 ఎకరాలలో సాగు

మండలంలో 4,668 ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. అందులో బొల్లారంలో 435, కొర్లకుంటలో 191, వల్లాభాపురంలో 66, గోపల్‌దిన్నెలో 384, కల్వరాల్లలో 345, గోవర్ధనగిరిలో 867, పుల్గర్‌చర్లలో 196, సంగినేనిపల్లిలో 381, సంపత్‌రావుపల్లిలో 175, తూముకుంటలో 441, వీపనగండ్లలో 1,207 ఎకరాలలో రైతులు మామిడి పంటలను సాగు చేస్తున్నారు. దీంతోపాటు మరో 1,500 ఎకరాలలో చిన్నదశలో ఉన్న మామిడి మొక్కలను పెంచుతున్నారు.

ఏట నష్టాలలో..

మూడేళ్లుగా మామిడి తోటలకు తామర తెగులు సోకడంతో ఎకరాకు 30 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా కనీసం 10 టన్నుల దిగుబడి కూడా రాలేదు. వచ్చిన కొద్దిపాటి దిగుబడిని అమ్ముకునేందుకు సమీపంలో మామిడి మార్కెట్‌లను ఏర్పాటు చేయకపోవడంతో జడ్చర్ల, హైదరాబాద్ పట్టణానికి మామిడికాయలను తీసుకెళ్లిన రైతులు దళారుల బారినపడి అధిక మొత్తంలో నష్టపోయారు. ఉన్నతాధికారులు చొరవ చూపి మామిడి మార్కెట్ తోపాటు అవగాహన సదస్సును నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు డబ్బులు రాలేదు



మామిడి తోటలను లీజుకు తీసుకొని రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టగా వచ్చిన దిగుబడిని విక్రయించగా కనీస కౌలు డబ్బులు కూడా రాలేదు. కొల్లాపూర్‌లో మామిడి విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఎన్నో ఏళ్లుగా చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

– రాజు, రైతు సంగినేపల్లి

సమష్టి చర్యలతోనే అధిక లాభాలు



మామిడి రైతులు సమష్టి నివారణ చర్యలు తీసుకోవడం వల్లే అధిక దిగుబడులను పొందవచ్చు. సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్ల బారి నుంచి మామిడి తోటలను కాపాడుకోవచ్చు. అవగాహన సదస్సుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– కృష్ణ, ఉద్యావనశాఖ అధికారి, వీపనగండ్ల

ప్రమాదకరంగా ప్రయాణం



దేవినేనిపల్లికి జీపుపై ప్రమాదకరంగా వెళ్తున్న గ్రామస్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలో వివిధ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలలో ప్రయాణించక తప్పడం లేదు. ప్రైవేట్ వాహన డ్రైవర్లు ఇదే అదునుగా భావించి సామర్థ్యానికి మించి ప్రయాణికులకు ఎక్కించుకొని గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుతున్నారు. ఆటోలు, జీపుల డ్రైవర్ల నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని ఆటోలు, జీపులు బోల్తా పడిన ఘటనలు ఉన్నాయి. మండలంలోని పెద్ద కార్వాముల, చిన్నకార్వాముల, దేవినేనిపల్లి, పెద్దకొత్తపల్లి, యాపట్ల, మర్రికల్, ముష్టిపల్లి, వెనచర్ల, నక్కలపల్లి, దేవల్‌తిరుమలాపూర్ గ్రామాలకు ఆటోలు, జీపులపై అధికంగా ప్రయాణిస్తున్నారు. ప్రైవేట్ వాహనాలను నియంత్రించడంలో అధికారులు విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలబారిన పడకముందు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.